# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 246 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 13 ఆగస్టు 2026 | పేజీలు : 2




## కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే పల్లా

- చిన్నాన్నకు ఆత్మీయ వీడ్కోలు

3




ఉన్నత విద్యాకుసుమాలను పూయించే మార్గదర్శన కేంద్రంగా, వేలాది మంది మేధావులను తీర్చిదిద్దిన కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులను తయారుచేసే 'విద్యా విభాగం'లోనే బోధకుల బతుకులు ఛిద్రమవుతున్నాయి. సమాజానికి దారి చూపే అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా సమాజంలో ఎంతో గౌరవం పొందుతున్నామని సంబరపడాలో.. నెలాఖరున చేతికొచ్చే అరకొర జీతం చూసి కన్నీరు కార్చాలో తెలియక కాకతీయ వర్సిటీ అతిథి అధ్యాపకులు తీవ్ర తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పీహెచ్‌డీలు, రెండుమూడు పీజీ డిగ్రీలు ఉన్న తమ పరిస్థితి అడ్డమీద కూలీల కంటే దయనీయంగా మారిందని కన్నీటిపర్యంతం అమవుతున్నారు.

2 లో

## బహుళ అంతస్తుల సాగుతో
# అధిక రాబడి

- సాగు, మార్కెటింగ్ సదుపాయాలపై సహకారం అందిస్తాం..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



3 లో



## బుల్లెట్ రైలు కారిడార్‌లో
# నకిరేకల్‌ను కూడా చేర్చాలి

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**న్యూఢిల్లీ, మన చౌరాస్తా :** ప్రతిపాదిత హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ (బుల్లెట్ రైలు) కారిడార్‌లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని చేర్చాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రైల్వే మంత్రితో భేటీ అయిన ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్‌కు బదులుగా ప్రస్తుతం ఉన్న NH65 జాతీయ రహదారి కారిడార్ గుండా ఈ రైలు మార్గాన్ని పరిశీలించాలని కోరారు. దీనివల్ల నకిరేకల్‌తో పాటు భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రధాన పట్టణాలు, వాణిజ్య కేంద్రాల ప్రజలకు మెరుగైన రవాణా వసతి దక్కుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించాలని రైల్వే శాఖను అభ్యర్థించారు. సమావేశంలో ఎంపీలు మల్లు రవి, సురేష్ షెట్కర్, గడ్డం వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




**హనుమకొండ, మన చౌరాస్తా :** ఉన్నత విద్యాకుసుమాలను పూయించే మార్గదర్శన కేంద్రంగా, వేలాది మంది మేధావులను తీర్చిదిద్దిన కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులను తయారుచేసే 'విద్యా విభాగం'లోనే బోధకుల బతుకులు ఛిద్రమవుతున్నాయి. సమాజానికి దారి చూపే అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా సమాజంలో ఎంతో గౌరవం పొందుతున్నామని సంబరపడాలో.. నెలాఖరున చేతికొచ్చే అరకొర జీతం చూసి కన్నీరు కార్చాలో తెలియక కాకతీయ వర్సిటీ అతిథి అధ్యాపకులు తీవ్ర తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పీహెచ్‌డీలు, రెండుమూడు పీజీ డిగ్రీలు ఉన్న తమ పరిస్థితి అడ్డమీది కూలీల కంటే దయనీయంగా మారిందని కన్నీటిపర్యంతమవుతున్నారు.

**కొండంత ఆశతో వచ్చి.. నలిగిపోతూ!**

వివిధ సబ్జెక్టుల్లో డాక్టరేట్ పూర్తిచేసి, ప్రైవేట్ కళాశాలల్లో రూ.25,000 నుంచి రూ.30,000 వేతనాలు వదులుకుని కొండంత ఆశతో వర్సిటీలో అతిథి అధ్యాపకులుగా చేరితే.. ఇక్కడ తీవ్ర నిరాశే ఎదురైంది. చట్టాలు కాగితాలకే పరిమితం : కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన అన్‌స్కిల్డ్ లేబర్ కనీస వేతనం (నెలకు రూ.15,000) కూడా తమకు దక్కడం లేదని, 'సమాన పనికి సమాన వేతనం' అనే సూత్రాలు కేయూలో మచ్చుకైనా కనిపించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఓయూతో పోలిస్తే తీవ్ర వ్యత్యాసం..**

పక్కనే ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అతిథి, పార్ట్ టైమ్ అధ్యాపకులకు పీరియడ్‌కు రూ.700 చెల్లిస్తుంటే.. కేయూలో మాత్రం కేవలం రూ. 500 కూడా సరిగా చెల్లించడం లేదు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (NCTE) నిబంధనలను అర్హతల విషయంలో అమలు చేస్తున్న అధికారులు, వేతనాల్లో ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నిస్తున్నారు.

**అదనపు పనిభారం..**

విద్యావిభాగంలో మొత్తం 15 మంది అధ్యాపకులు ఉండాల్సిన చోట కేవలం 9 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో మిగిలిన వారిపై అదనపు బోధనా భారం పడుతోంది. ఉన్నతాధికారులు విభాగాన్ని సందర్శించి పనితీరును 'భేష్' అని మెచ్చుకుంటున్నా, వేతనాల పెంపు అనగానే ముఖం చాటేస్తున్నారని డాక్టరేట్లు మండిపడుతున్నారు. ఒక వైపు ఏళ్ల తరబడి రూ.లక్షల్లో వేతనాలు తీసుకుని రిటైర్ అయిన ప్రొఫెసర్లకు మళ్లీ అవకాశాలు కల్పిస్తూ, ఎన్నో ఆశలతో వచ్చిన నిరుద్యోగులను, యంగ్ స్కాలర్లను శ్రమ దోపిడీకి గురిచేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు.

**రూ.30 వేలు ఇవ్వాలి..**

తమ మధ్య ఉన్న అనైక్యతను అధికారులు పావుగా వాడుకుంటూ దారుణమైన శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని, వర్సిటీ యంత్రాంగం ఇకనైనా స్పందించి అతిథి అధ్యాపకులకు కనీస వేతనంగా నెలకు రూ. 30,000 చెల్లించి ఆదుకోవాలని, ఇంటా బయటా దెబ్బతింటున్న తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని అధ్యాపకులు ప్రభుత్వాన్ని, విద్యాశాఖను కోరుతున్నారు.



# ఉపాధ్యాయ సంక్షేమమే ధ్యేయం

**టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి**

**నర్మెట, మన చౌరాస్తా :** ఉపాధ్యాయ సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (TSUTF) పనిచేస్తోందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందిన జనగామ జిల్లా, నర్మెట్ట మండలం అమ్మాపూర్ ఉన్నత పాఠశాల బయోసైన్స్ ఉపాధ్యాయుడు పొట్టబతిని భాస్కర్ కుటుంబానికి TSUTF కుటుంబ సంక్షేమ నిధి నుండి రూ. 6 లక్షల చెక్కును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా చావా రవి మాట్లాడుతూ.. 'ఒక్కరి కోసం అందరం.. అందరి కోసం ప్రతి ఒక్కరం' అనే నినాదంతో ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మరణించిన 65 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు మొత్తంగా రూ. 3.90 కోట్లు అందించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలనే మానవతా దృక్పథంతో ఉపాధ్యాయుల నుంచి ఈ నిధులను సమీకరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ నిధి ఛైర్మన్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్, ఎడ్ల సైదులు, FWF స్టేట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రావు, మదూరి వెంకటేశ్, జిల్లా బాధ్యులు కృష్ణ, శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో

# 'స్టూడెంట్ లీడర్స్' ఎన్నికలు

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలోని తెలంగాణ మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య బద్ధమైన నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు నిర్వహించిన "స్టూడెంట్ లీడర్స్ ఎలక్షన్స్" బుధవారం అత్యంత ఉత్సాహపూరిత, శాంతియుత వాతావరణంలో ముగిశాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కర్రే కుమారస్వామి చీఫ్ ఎలక్షన్ కమీషనర్‌గా వ్యవహరించి, ఈ ఎన్నికల ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. సాధారణ ఎన్నికలను తలపించేలా బ్యాలెట్ పద్ధతిలో సోషల్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఈ పోలింగ్ నిర్వహించారు. ఎలక్షన్ కమీషనర్‌గా స్కూల్ కోఆర్డినేటర్ సంధ్యారాణి, రిటర్నింగ్ ఆఫీసర్‌గా పీజీటీ సురేష్, సహాయ పోలింగ్ అధికారులగా పదో తరగతి విద్యార్థులు బాధ్యతలు నిర్వర్తించారు. స్కూల్ పీపుల్ లీడర్ (SPL)తో పాటు కల్చరల్, స్పోర్ట్స్, క్లీన్ అండ్ హైజీన్, డార్మిటరీ, మెస్, డిసిప్లిన్, ఎకోమిత్ర లీడర్ పదవులకు విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్



కర్రే కుమారస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులకు రాజ్యాంగ వ్యవస్థలు, ఓటు హక్కు ప్రాముఖ్యత మరియు ప్రజాస్వామ్య విధానాలపై ఆచరణాత్మక అవగాహన కల్పించడానికే ఈ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. గెలుపొందిన నాయకులు తోటి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, పాఠశాల క్రమశిక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ ఆఫీస్ ముందు టీచర్ల నిరసన

**జనగామ, మన చౌరాస్తా :** పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (USPC) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జనగామ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్ రావు, శ్రీనివాసులు మాట్లాడారు. పీఆర్‌సీ (PRC) నివేదికను వెంటనే ప్రకటించి 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 విడతల డిఏ (DA)లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ (CPS)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (OPS) పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపజేయాలని కోరారు. అశాస్త్రీయంగా ఉన్న జీఓ 25ను రద్దు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని స్పష్టం చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనుల భారాన్ని తగ్గించి, విద్యాశాఖలో ఎన్జీవోల జోక్యాన్ని అరికట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 29న హైదరాబాద్‌లో వేలాది మందితో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ సంఘాల నాయకులు శ్రీధర్, రాజీ రెడ్డి, వజ్రయ్య, అఫ్సర్, హిమబిందు, చొక్కయ్య, మహేష్, వీర్యా నాయక్, మర్రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.







# బహుళ అంతస్తుల సాగుతో అధిక రాబడి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** బహుళ అంతస్తుల సాగు (MultiStoried Farming) విధానాలను అవలంబించడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని, పంటల సాగు , మార్కెటింగ్ సదుపాయాలపై వారికి అవసరమైన సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామంలో రైతు మంద రాములు తన సుమారు రెండు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న బహుళ అంతస్తుల సాగు విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో మునగ, సపోటా, సీతాఫలం, అరటి, అంజీర్, నిమ్మ వంటి ఉద్యాన పంటలతో పాటు బీర, సొర తదితర తీగజాతి కూరగాయల పంటల సాగు తీరును, నిర్వహణను ఆయన ఆరా తీశారు. ఒకే భూమిలో విభిన్న రకాల పంటలను పండిస్తూ అదనపు రాబడి పొందేలా రైతు చేపడుతున్న ఈ వినూత్న విధానాన్ని పర్యవేక్షించిన కలెక్టర్, పెట్టుబడి, పంటల నిర్వహణ వ్యయం, ప్రభుత్వం నుంచి అందుతున్న సబ్సిడీలు మరియు ఇతర ప్రోత్సాహకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి లభ్యత మరియు మోటారు ఖర్చులపై ఆరా తీసిన కలెక్టర్, నీటిని పొదుపుగా వాడుతూ ప్రతి మొక్కకూ తగినంత నీరు అందేలా డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని రైతుకు సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసే ఆధునిక పద్ధతులను రైతులు విస్తృతంగా అవలంబించాలన్నారు. బీర, సొర వంటి తీగజాతి కూరగాయలకు పందిర్లు ఏర్పాటు చేయడం వల్ల మొక్కల పెరుగుదల మెరుగుపడి, పంట నాణ్యత పెరగడమే కాకుండా పురుగులు, తెగుళ్ల ప్రభావాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. కాబట్టి రైతులకు పందిర్ల ఏర్పాటు కోసం ప్రభుత్వ పథకాల ద్వారా అర్హత మేరకు సబ్సిడీ సహాయం అందించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. పంట ఉత్పత్తుల విక్రయాలపై ఆరా తీస్తూ, రైతులు పండించిన పంటలకు స్థానికంగానే కాకుండా సమీప మార్కెట్లు, రైతు బజార్లు, ఇతర విక్రయ కేంద్రాల్లో మెరుగైన ధర లభించేలా మార్కెటింగ్ అవకాశాలను అన్వేషించాలని సూచించారు. పంటలను పురుగులు, తెగుళ్ల నుంచి రక్షించేందుకు క్రమంగా పర్యవేక్షిస్తూ, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, అధికారుల సలహాలతో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామంలో ఇలాంటి నమూనా సాగు పద్ధతులు అవలంబిస్తున్న రైతులను గుర్తించి, వారి అనుభవాలను ఇతర రైతులకు తెలియజేయాలని అధికారులను కోరారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి (DAO) అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, కేవీకే శాస్త్రవేత్త రమ్య, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కన్నీటి పర్యంతమైన పల్లా..

## చిన్నాన్నకు ఆత్మీయ వీడ్కోలు

**వేలేరు, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చిన్నాన్న, రిటైర్డ్ టీచర్ పల్లా జనార్దన్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా హుటాహుటిన హన్మకొండ జిల్లా వేలేరు మండలం సోడశపల్లి గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. చిన్నాన్న భౌతికకాయాన్ని చూసి తీవ్ర భావోద్వేగానికి లోనైన ఆయన, చిన్ననాటి జ్ఞాపకాలను, విద్యాబోధకుడిగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. అంతిమయాత్రలో స్వయంగా చిన్నాన్న పాడెను తన భుజాలపై మోసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎలాంటి కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.



# సమీకృత వ్యవసాయంతో స్థిరమైన ఆదాయం

**పాలకుర్తి వాణి, స్టేషన్‌ఘన్‌పూర్ :** సమీకృత సాగు విధానాలతో రైతులు తక్కువ నీటితో అధిక దిగుబడులు, స్థిరమైన ఆదాయం పొందేలా సాంకేతిక సహకారం అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం ఘనపూర్ స్టేషన్‌లో రైతు ఊర లింగయ్యకు చెందిన 8 ఎకరాల పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. వరికి ప్రత్యామ్నాయంగా టమోటా, చిక్కుడు, బంతి, బెండ వంటి పంటలను సాగు చేయడాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేలలో తేమను కాపాడే మల్చింగ్, నీటి వృథాను తగ్గించే డ్రిప్ మైక్రో ఇరిగేషన్ పద్ధతులను రైతులు విస్తృతంగా అవలంబించాలని సూచించారు. పురుగులు, తెగుళ్ల నివారణకు వేపనూనె వంటి సేంద్రియ పద్ధతులు వాడాలన్నారు. ఇతర రైతులకు అవగాహన కలిగించేలా ఈ క్షేత్రంలో 'డెమో ప్లాట్' ఏర్పాటు చేయడంతో పాటు 'సాయిల్ సోలరైజేషన్' వంటి శాస్త్రీయ పద్ధతులపై చైతన్యం తేవాలని అధికారులను ఆదేశించారు.



**సమగ్ర వ్యవసాయంతోనే రైతులకు లబ్ధి**

రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలపై దృష్టి సారించాలని, నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం ఘనపూర్ (స్టేషన్) మండలంలోని ఛాగల్ గ్రామంలో కలెక్టర్ పర్యటించి రైతు చిక్కుల్ల రమేష్, చాదరబోయిన వెంకన్నలకు చెందిన కంది, పత్తి పంటలను, పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా నిర్దేశించిన 1,500 ఫార్మ్ పాండ్స్ లక్ష్యాన్ని సాధించి, రైతుల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాలు తగ్గుతున్నందున ప్రతి చుక్క నీటిని పొదుపు చేసేలా డ్రిప్ ఇరిగేషన్ వినియోగించాలని తెలిపారు. లాభసాటిగా ఉండే ఆయిల్ పామ్ సాగుకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయని, రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అలాగే దెంచా వంటి పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, కేవీకే శాస్త్రవేత్త రమ్య, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల డిప్యూటీ తహసీల్దార్ షాకీర్‌కు నాయకులు వినతిపత్రం సమర్పించారు. దీనిని ముఖ్యమంత్రికి పంపించాలని కోరారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు మదూరి వెంకటేష్ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ (PRC) అమలు, డీఏ (DA) బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులకు అనుకూలమైన పని వాతావరణం కల్పించాలని కోరారు. ప్రజా విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం చేపడుతున్న ఉద్యమానికి ఉపాధ్యాయులంతా ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, యాదయ్య, జి. కృష్ణ, ఈ. నర్సింలు, తేరాల నవీన్ కుమార్, టి. కృష్ణవేణి, సుధ, పరుశరాములు, రాజయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా : నటి సమంత

నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్ : హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**